క్లుప్తంగా

ప్రశాంత ఎన్నికలకు సహకరించాలి



సదస్సులో మాట్లాడుతున్న ఎస్సై నాళం శ్రీనివాసరావు

పాలకోడేరు: ప్రశాంత ఎన్నికలకు ప్రజలు సహకరించాలని ఎస్సై నాళం శ్రీనివాసరావు కోరారు. గురువారం జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల ఆదేశాల మేరకు భీమవరం డీఎస్పీ నారాయణస్వామి రెడ్డి భీమవరం రూరల్ సీఐ వై.సత్యకిషోర్ ఆధ్వర్యంలో కోరుకొల్లులో నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలు నిర్భయంగా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. ఎన్నికల నిబంధనలను ఎవ్వరూ ఉల్లంఘించరాదని, అనవసరంగా పోలీస్ కేసుల్లో ఇరుక్కోవద్దని సూచించారు. కార్యక్రమంలో గ్రామస్తులు, అధికారులు పాల్గొన్నారు.

మద్యం దుకాణాల తనిఖీ



మహదేవపట్నంలో మద్యం దుకాణాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు

ఉండి: ఎన్నికల విధుల్లో భాగంగా గురువారం మహదేవపట్నంలోని ఓ మద్యం దుకాణాన్ని ఎంపీడీవో ఎస్ రవీంద్ర,, ఈవోపీఆర్డీ ఎం రామకృష్ణారెడ్డి, ఏఎస్సై ఎ.సూర్యనారాయణ పరిశీలించారు. స్టాక్, రిజిస్టర్‌ను పరిశీలించి నిల్వలు సరిపోవడంతో సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం అధికారులు మాట్లాడుతూ ఎన్నికలు సక్రమంగా నిర్వహించేందుకు గాను అన్ని ఏర్పాట్లు కట్టుదిట్టంగా చేస్తున్నట్లు తెలిపారు. ఎప్పటికప్పుడు వాహనాలు, మద్యం దుకాణాల తనిఖీ నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

మాలవానితిప్పలో చలివేంద్రం ఏర్పాటు



చలివేంద్రంలో మజ్జిగ అందిస్తున్న సుబ్బరాజు

కాళ్ల: మలవానితిప్ప గ్రామంలోని ప్రధాన సెంటర్లో గ్రామ సర్పంచ్, వైఎస్సార్ సీపీ నేత సాగిరాజు సుబ్బరాజు ఆధ్వర్యంలో గురువారం మజ్జిగ చలివేంద్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రయాణికులకు, గ్రామస్తులకు మజ్జిగ అందజేశారు. కార్యక్రమంలో పంచాయతీ బోర్డ్ సభ్యులు, గ్రామ పెద్దలు, ప్రయాణికులు పాల్గొన్నారు.

నేడు ఎన్నికల శిబిరం ప్రారంభోత్సవం

భీమవరం (ప్రకాశం చౌక్): భీమవరం రెండో పట్టణం వంశీ నగర్‌లో శుక్రవారం ఉదయం 7 గంటలకు వైఎస్సార్ సీపీ ఎన్నికల శిబిరం ప్రారంభిస్తున్నట్లు పట్టణ అధ్యక్షుడు తోట భోగయ్య, రాష్ట్ర కార్యదర్శి ఏఎస్ రాజు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని పార్టీ నాయకులు, కార్యకర్తలు విధిగా హాజరుకావాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పాలకోడేరు: గొల్లలకోడేరు సబ్‌స్టేషన్ మరమ్మతుల నిమిత్తం శుక్రవారం ఉదయం 7 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు 33/11 కేవీ ఫీడర్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు భీమవరం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పీర్ అహ్మద్ ఖాన్ తెలిపారు గొల్లకోడేరు, గరగపర్రు, యండగండి, మైప గ్రామాల విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఈఈ కోరారు.

ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం

పెనుగొండ: ఆచంట మండలంలో ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించినట్లు వ్యవసాయాధికారి బి.నాగరాజు తెలిపారు. గురువారం ఆచంట రైతు భరోసా కేంద్రం వద్ద ధాన్యం కొనుగోళ్లను తహసీల్దార్ ఐపీ శెట్టి లాంఛనంగా ప్రారంభించారు. రైతు చేకూరి గోపాలకృష్ణకు ట్రక్ షీట్ జనరేట్ చేసి తహసీల్దార్ కొనుగోళ్లను ప్రారంభించారు. రైతులంతా వరి కోతలు పూర్తయిన వెంటనే ధాన్యం ఆరబెట్టుకొని తేమ శాతం పరీక్షించుకుని అమ్మకాలు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎల్ఎస్‌సీఎస్ ఆచంట కార్యదర్శి పి.విష్ణు, ఆర్‌బీకే ఇన్‌చార్జి కె.శృతి పాల్గొన్నారు.

అమ్మవారికి సారె సమర్పణ

నరసాపురం: రాయిపేటలోని శ్రీ పుంతలో ముసలమ్మ(శీతలమాత) అమ్మవారి జాతర మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. జాతర ఉత్సవాల్లో భాగంగా గురువారం అమ్మవారికి భక్తులు సారె సమర్పించారు. ముందుగా భక్తులు చీరలు, పసుపు, కుంకుమ, స్వీట్లు తదితర వస్తువులతో కూడిన సారెను మంగళవాయిద్యాల మధ్య రాయిపేటలో ఊరేగించారు. అనంతరం అమ్మవారికి సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ పెద్దలు తమ్మిశెట్టి బాబ్జి, పోలిశెట్టి తాతారావు, కావలి వెంకటరత్నం, తాడి రామసత్యం తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ కాంతులు జగన్‌కే సాధ్యం



చిలుకూరులో పీవీఎల్, ఉమాబాలకు స్వాగతం పలుకుతున్న సర్పంచ్ వెంకటసోమరాజు, మహిళలు



ర్యాలీలో ప్రజలకు అభివాదం చేస్తున్న వైఎస్సార్ సీపీ అభ్యర్థులు

- వైఎస్సార్ సీపీ అభ్యర్థులు పీవీఎల్, ఉమాబాల
- ఉండి మండలంలో ఎన్నికల ప్రచారం
- మోటార్‌సైకిల్ ర్యాలీకి గ్రామగ్రామానా బ్రహ్మరథం

ఉండి: కుల, మత, పార్టీలు చూడకుండా అర్హతే ప్రామాణికంగా ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించి నిరుపేదల జీవితాల్లో వెలుగులు నింపిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని వైఎస్సార్ సీపీ ఉండి ఎమ్మెల్యే అభ్యర్థి పీవీఎల్ నరసింహరాజు అన్నారు. గురువారం ఉండి మండలంలో ఆయన ఎంపీ అభ్యర్థి గూడూరి ఉమాబాలతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ సంక్షేమ పథకాలద్వారా పేదలకు దోచిపెడుతున్నారని ఏడ్చిన చంద్రబాబు తాను ఆ పథకాలు కొనసాగిస్తానని చెబుతూ మోసం చేసేందుకు వస్తున్నాడని, ప్రజలు ఆ మాటలు నమ్మవద్దని కోరారు. ప్రస్తుతం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాలని కోరారు.

ర్యాలీకి బ్రహ్మరథం

ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా గురువారం గ్రామాల్లో నిర్వహించిన మోటార్‌సైకిల్, కార్ ర్యాలీకి ఉండి మండల ప్రజలు బ్రహ్మరథం పట్టా రు. గ్రామ గ్రామాన అక్కచెల్లెమ్మలు ఉండి ఎమ్మెల్యే అభ్యర్థి పీవీఎల్ నరసింహరాజుకు, ఎంపీ అభ్యర్థి గూడూరి ఉమాబాలకు హారతులిచ్చి ఆత్మీయస్వాగతం పలికారు. కోలమూరులో సర్పంచ్ నడింపల్లి సత్యవతికృష్ణంరాజు, పార్టీ సీనియర్ నాయకుడు గంధ్రాజు రాజేష్‌వర్మ ఆధ్వర్యంలో భారీ క్రేన్ సహా యంతో గజమాలలువేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఉండి సెంటర్‌లో అభిమానులు, నాయకులు పెద్ద ఎత్తున పూలమాలలు వేసి జై జగన్, జై పీవీఎల్, జై ఉమాబాల అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ప్రతి గ్రామంలోనూ అభిమానులు ర్యాలీపై పూలవర్షం కురిపించారు. దీంతో వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో ఉత్సాహం వెల్లువెత్తింది. మండలంలో చినపుల్లేరు గ్రామం నుంచి ప్రారంభమైన మోటార్‌సైకిల్, కార్ ర్యాలీ పెదపుల్లేరు, కలిసిపూడి, చెరుకువాడ, ఉండి, పాములపర్రు, కోలమూరు, ఆరేడు, పాందువ్వ, ఉణుదుర్రు, యండగండి, చిలుకూరు, మహదేవపట్నం గ్రామాల మీదుగా సాగింది. ఈ ర్యాలీలో పీవీఎల్ సోదరుడు గోపాలకృష్ణంరాజు, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్ పాతపాటి శ్రీనివాసరాజు(వాసు), టీటీడీ బోర్డు మాజీ సభ్యుడు గోకరాజు రామరాజు, డీసీఎంఎస్ చైర్మన్ వేంద్ర వెంకటస్వామి, ముదునూరి సుబ్బరాజు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు పీవీ ఆర్‌కే ఆంజనేయరాజు, ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణరాజు, జెడ్పీటీసీ రణస్తుల కనకదుర్గ, రాష్ట్ర జానపద కార్పొరేషన్ డైరెక్టర్ గులిపల్లి అచ్చారావు, రణస్తుల మహంకాళి, వైస్ ఎంపీపీ గుత్తుల కనకమహాలక్ష్మీ కృష్ణ, సర్పంచ్‌లు పెన్మెత్స సావిత్రమ్మరాజు, కరణం పార్వతీ వెంకటేశ్వరరావు, కమతం సౌజన్యబెనర్జీ, కొండవేటి సాంబశివరావు, ముదు నూరి వెంకటసోమరాజు, నడింపల్లి సత్యవతి రామకృష్ణంరాజు, గోగులమండ చినకృష్ణమూర్తి, ముదు నూరి సుబ్బరాజు, నాయకులు చేకూరి బోసు రాజు, నడింపల్లి రామకృష్ణంరాజు, గంధ్రాజు రాజేష్, వగ్రే పైడియ్య, తాటిపట్టి పెదవీరప్ప, గొట్టుముక్కల కళ్యాణ్‌వర్మ, యేడిద వెంకటేశ్వరరావు, పేరిచర్ల సూర్యనారాయణరాజు పాల్గొన్నారు.

రెండు ఓట్లూ ఫ్యాన్ గుర్తుకే వేయండి

ఎంపీ అభ్యర్థి గూడూరి ఉమాబాల మాట్లాడుతూ సామాన్యులను కూడా అందలం ఎక్కిస్తున్న జగన్‌మోహన్‌రెడ్డి నిజమైన సంఘ సంస్కర్త అని అన్నారు. ఓ సాధారణ బీసీ మహిళ అయిన తనకు ఎంపీ టికెట్ కేటాయించడం అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. ఎన్నో సంక్షేమ పథకాల ద్వారా ప్రజలందరికీ అండగా నిలబడ్డ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వచ్చే ఎన్నికల్లో రెండు ఓట్లూ ఫ్యాన్ గుర్తుకే వేసి అండగా నిలబడాలన్నారు. జగన్ రుణం తీర్చుకునే అవకాశం ప్రజలకు లభించిందని ఆయన్ను మరోసారి ముఖ్యమంత్రిగా చేసి మన అభివృద్ధికి, సంక్షేమానికి మనమే బాటలు వేసుకుందామని ఆమె పిలుపునిచ్చారు. అలాగే ఉండిలో వైఎస్సార్ సీపీ జెండా ఖచ్చితంగా ఎగురవేయాలన్నారు.

14న అంబేడ్కర్ జయంతికి ఏర్పాట్లు

పాలకోడేరు: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి వేడుకలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు మోగల్లు అంబేడ్కర్ యూత్ తెలిపింది. ఈ మేరకు గురువారం మోగల్లులో విలేకరుల సమావేశంలో యూత్ సభ్యులు న్యాయవాది నేతల శ్యామ్‌కుమార్, దుండి సంజీవ్ మాట్లాడుతూ ఈనెల 14వ తేదీన అంబేడ్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహిస్తామన్నారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, స్వీట్లు పండ్లు పంపిణీ చేస్తామన్నారు. అలాగే సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. గ్రామస్తులు పాల్గొని ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో బొడ్డే ధర్మారావు, గోడి రవి, మైలాబత్తుల సునీల్, సుందర బాబు ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

మచిలీపట్నం మీదుగా బీహెచ్ఈఎల్ సర్వీసు

భీమవరం (ప్రకాశంచౌక్): భీమవరం నుంచి హైదరాబాద్ (బీహెచ్ఈఎల్) ఇంద్ర బస్ సర్వీసు వయా బంటుమిల్లి, పెడన, మచిలీపట్నం మీదుగా ప్రారంభించామని డిపో మేనేజర్ పి.ఎస్.వి.ఎం.సత్యనారయణ మూర్తి తెలిపారు. భీమవరం డిపో నుంచి రాత్రి 21.00 గంటలకు భీమవరంలో బయలుదేరి గొల్లవానితిప్ప, కృత్తివెన్ను, బంటుమిల్లి మీదుగా ఇంద్ర బస్ హైదారాబాద్ – బీహెచ్ఈఎల్‌కు చేరుకుంటుందన్నారు. ఈ సర్వీసు తిరిగి మళ్లీ బీహెచ్ఈఎల్ నుంచి సాయంత్రం 20.45 గంటలకు బయలుదేరి భీమవరం ఉదయం 06.25 కు చేరుకుంటుందన్నారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఘనంగా రంజాన్ వేడుకలు

భీమవరం (ప్రకాశంచౌక్): పట్టణంలో రంజన్ వేడుకలను ముస్లిం సోదరులు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని పలు మసీదుల్లో రంజాన్ పురస్కరించుకుని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఒకరికొకరు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు. అలాగే కుల, మతాల అతీతంగా అందరికీ ముస్లిం సోదరులు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఆయా మసీదుల్లో మత పెద్దలు రంజాన్ పండగ విశిష్టతను తెలియజేశారు.

ముస్లిం సోదరులు అన్ని విధాలుగా పైకి రావాలి

ముస్లిం సోదరులు అన్ని విధాలుగా పైకి రావాలని, అందరికీ అల్లా ఆశీస్సులు ఉంటాయని రాష్ట్ర ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ ఆకాంక్షించారు. నరసయ్య అగ్రహారంలోని సున్ని జామియా మసీదులో గురువారం జరిగిన రంజాన్ వేడుకల్లో ఆయన పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముందుగా ముస్లిం సోదరులకు ఈద్ ముబారక్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ముస్లిం సోదరుల రంజాన్ పండుగను నెల రోజులపాటు ఎంతో శ్రద్ధగా ఉపవాసాలు ఉంటూ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి అల్లా పట్ల వారి భక్తిని చాటుకుంటారన్నారు. ఈ కార్యక్రమంలో గూడూరి జగదీష్, తోట భోగయ్య కరిముల భాషా, ఎస్.కె అన్సారీ,ఎస్.కె పాషా, ఎస్.కె రబ్బాని, ఎండి సాబూ ఎంఏ నౌషాద్, ఎండి ఖలీల్, అహ్మద్‌పాషా, ఎండి ఖాన్, ఎండి అబ్దుల్, ఎండి బాబ్జిమాస్టర్, ఎండి జాఫర్ పాషా, ఎస్.కె సుభాని, ఎండి సలీం, ఎండి ఉమర్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో రంజాన్ పండుగ

ఉండి: అల్లా బోధించిన బాటలో ప్రతి ముస్లిం ప్రయాణించాలని ఉండి జామియా మసీదు ఇమామ్ షేక్ అర్షద్ తెలిపారు. మండలంలోని ఉండి, చెరుకువాడ తదితర ప్రాంతాల్లో రంజాన్ పర్వదినం సందర్భంగా ముస్లింలు మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. తరువాత ఒకరికొకరు ఆలింగనాలు చేసుకుంటూ రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా ఇమామ్ అర్షద్ మాట్లాడుతూ మంచి బోధించే ఖురాన్ ద్వారా అల్లా మాటలను తూచ తప్పకుండా పాటించాలన్నారు. నిరుపేదలకు ఎల్లప్పుడూ దానం చేయాలన్నారు. అనంతరం ఉండి సెంటర్‌లో ముస్లింలు ఖీర్‌ను వాహనదారులు, ప్రయాణికులు, స్థానిక ప్రజలకు పంపిణీ చేసి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో షేక్‌కన్నా సాహెబ్, సిద్దా సాహెబ్, షేక్ బూజీ, షేక్ మీరాసాహెబ్, షేక్ మస్తాన్ సాహెబ్, షేక్ మహబూబ్, షేక్ బాబూజీ పాల్గొన్నారు.



రంజాన్ వేడుకల్లో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్



ఉండి: మసీదులో ప్రార్థనలు చేస్తున్న ముస్లిం సోదరులు



ఆకివీడు: ముస్లిం సోదరులు భారీ ర్యాలీ నిర్వహించిన దృశ్యం



పాలకోడేరు: మసీదులో ప్రార్థనలు నిర్వహిస్తున్న ముస్లింలు

ఆకివీడు: రంజాన్ పండుగను ముస్లింలు భక్తి శ్రద్ధలతో గురువారం జరుపుకున్నారు. పట్టణంలోని స్థానిక పెద్ద మసీదు వద్ద ప్రార్థనలు చేసి ప్రదర్శనగా రైల్వే స్టేషన్ రోడ్డులోని చిన్న మసీదు వద్దకు చేరుకున్నారు. అక్కడ ప్రత్యేక ప్రార్థనలు చేసి ఒకరినొకరు ఆలింగనం చేసుకుని రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. కార్యక్రమంలో స్థానిక ముస్లిం పెద్దలు, యువకులు, బాలలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పాలకోడేరు: మండలంలో ముస్లింలు గురువారం రంజాన్ పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. గరగపర్రు, పెన్నాడ, శృంగవృక్షం తదితర గ్రామాల్లో ముస్లిం మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఒకరికొకరు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. షేక్ పాపా సాహెబ్ మాట్లాడుతూ రంజాన్ పండుగ జాతీయతను, సంస్కృతి వికాసాన్ని ప్రతిబింబిస్తుందన్నారు. రంజాన్ అసలు పేరు రమదాన్ అని, అంటే శుభవేళ, ఉత్సవ సమయం అని వివరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ షేక్ పాపా సాహెబ్ (శంకరం), లాల్ సాహెబ్, అబ్దుల్ సాహెబ్, ముసలాసాహెబ్, బూరాన్ సాహెబ్, మస్తాన్ వలీ, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ ఇంటింటి ప్రచారం

ఆకివీడు: వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిగా, పీవీఎల్ నరసింహరాజును ఉండి ఎమ్మెల్యేగా గెలిపించుకునేందుకు మేము సిద్ధం అంటూ మండలంలోని కుప్పనపూడి శివారు తాళ్లకోడులోని ప్రజలు ముక్తకంఠంతో నినదించారు. స్థానికులు, వైఎస్సార్‌సీపీ నాయకులు కలిసి ఇంటింటికీ వెళ్లి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థిస్తూ గురువారం ప్రచారం చేశారు. ఈ ప్రచారానికి ప్రజలు, మహిళలు అధిక సంఖ్యలో మద్దతు తెలిపారు. వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు మెంటే లక్ష్మణరావు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ విజయం తథ్యమన్నారు. సంక్షేమ పథకాల ఫ్యాన్ గాలికి ప్రజలు సుఖంగా జీవిస్తున్నారని చెప్పారు. అభివృద్ధి పథంలో రాష్ట్రాన్ని నడుపుతున్న జగన్ రెండోసారి సీఎం అవ్వడం ఖాయమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పన్నాసి వెంకన్న, ముక్కు చంటి, యాళ్ల రవి కుమార్, చిట్టిబొమ్మ లక్ష్మీనారాయణ, సంపత మారేష్, జొన్న శ్రీనివాస్, తొంటా కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



తాళ్లకోడులో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

భీమవరం: ఆశా వర్కర్స్‌కు వైద్య శాఖ అధికారులు రకరకాల నిబంధనల పేరుతో పని భారాన్ని పెంచడాన్ని ఏపీ వలంటరీ హెల్త్ వర్కర్స్ యూనియన్ (ఆశ) జిల్లా కమిటీ సమావేశం తీవ్రంగా వ్యతిరేకించింది. గురువారం భీమవరం సీఐటీయు కార్యాలయంలో యూనియన్ జిల్లా అధ్యక్షురాలు చింతపల్లి లక్ష్మి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల అధికారులు పని ఒత్తిడితో వేధింపులకు గురిచేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఆశా వర్కర్లతో కార్యాలయాలను శుభ్రపరచడం, యూనిఫారమ్స్ , పీహెచ్‌సీలకు పంపిణీ చేయకుండా భీమవరంలో ఇవ్వడం దారుణమన్నారు. జిల్లాలో ఆశా వర్కర్లు ఎదుర్కొంటున్న సమస్యలపై వెంటనే జిల్లా అధికారి యంత్రాంగం పరిష్కరించాలని లక్ష్మి డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో యూనియన్ జిల్లా కోశాధికారి ఎస్ లారెన్స్ కుమారి, పి రాజేశ్వరి, ప్రశాంతి, రూప పద్మ, ఆదిలక్ష్మి, దేవి, జయంతి, రత్నకుమారి, వరలక్ష్మి, బేగం పాల్గొన్నారు.



యూనియన్ సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మి

అగ్నిప్రమాదంలో రెండు తాటాకిళ్లు దగ్ధం

పోడూరు: మండలంలోని కవిటం శివారు పాటిమీద గురువారం జరిగిన అగ్నిప్రమాదంలో రెండు తాటాకిళ్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. ఉదయం 10.45 గంటల సమయంలో ఉడుం బాలకృష్ణ, ఉడుం కోటేశ్వరరావు నివసిస్తున్న రెండు పోర్షన్ల తాటాకింట్లో వంట గ్యాస్ లీకవడంతో మంటలు వ్యాపించాయి. తరువాత పక్కన ఉన్న మారుమూడి రత్నమ్మ, మారుమూడి శ్రీను కుటుంబాలు నివస్తున్న తాటాకింటికి మంటలు వ్యాపించాయి. స్థానికులు మంటలను అదుపు చేసే ప్రయత్నం చేసినా ఫలించలేదు. పాలకొల్లు అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. ప్రమాదంలో దాదాపుగా రూ.3 లక్షల ఆస్తి నష్టం జరిగినట్లు ఆర్ఐ కె.రాంబాబు తెలిపారు. సమాచారం తెలిసిన వెంటనే తహసీల్దార్ బీవీవీ మురళీకృష్ణ, ఆర్ఐ రాంబాబు, వీఆర్‌ఓ ఎ.వీరాంజనేయులు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. బాధిత కుటుంబాలకు తక్షణసాయంగా 10 కేజీల చొప్పున బియ్యం అందజేశారు.

సామాజిక విప్లవవీరుడు జ్యోతిరావు ఫూలే

భీమవరం: ఆధునిక సామాజిక విప్లవవీరుడు జ్యోతిరావు పూలేనని దళిత, ప్రజా సంఘాల వక్తలు తెలిపారు. గురువారం భీమవరం ప్రకాశం చౌక్ సెంటర్‌లో కెవీపీఎస్ ఆధ్వర్యంలో మహాత్మ జ్యోతిరావు పూలే 197వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కెవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె క్రాంతిబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి జక్కంశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ సమాజంలో ఉన్న బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం తన జీవితాన్ని త్యాగం చేసిన మహనీయుడు జ్యోతిరావు పూలే నన్నారు. ఈ కార్యక్రమంలో కోనా జోసెఫ్, బోకూరి విజయరాజు, ఎం వైకుంఠరావు, బాలం వెంకటేశ్వరరావు, చెల్లబోయిన వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ ఆధ్వర్యంలో

కులవివక్షతతో అంటరానితనం, మహిళల అణచివేతకు వ్యతిరేకంగా సామాజిక అసమానతలను రూపుమాపడానికి 150 ఏళ్లకు ముందే ఉద్యమించిన సంఘసంస్కర్త, గొప్ప సామాజిక విప్లవవాది మహాత్మా జ్యోతిరావు పూలే జీవితం అందరికీ ఆదర్శం కావాలని సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు చెల్లబోయిన రంగారావు, ఎం సీతారాం ప్రసాద్, వైవీఆనంద్, ఛాన్ భాషా తదితరులు పాల్గొన్నారు.



భీమవరంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద జ్యోతిరావు పూలే చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న ప్రభుత్వ విప్ శ్రీనివాస్



భీమవరంలో కేవీపీఎస్ ఆధ్వర్యంలో జ్యోతిరావు పూలేకు నివాళులర్పిస్తున్న దృశ్యం

గొప్ప సంఘ సంస్కర్తల్లో అగ్రగణ్యుడు జ్యోతిరావు పూలే

భీమవరం (ప్రకాశంచౌక్): గొప్ప సంఘ సంస్కర్తల్లో అగ్రగణ్యుడు మహాత్మ జ్యోతిరావు పూలే అని రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు రచయిత కలిగోట్ల గోపాలశర్మ అన్నారు.



భీమవరంలో సీపీఐ ఆధ్వర్యంలో జ్యోతిరావు పూలేకు నివాళులర్పిస్తున్న దృశ్యం

మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి కార్యక్రమాన్ని జిల్లా సర్వోదయ మండలి ఆధ్వర్యంలో క్విట్ ఇండియా స్థూపం వద్ద నిర్వహించారు. ముందుగా పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. గోపాల శర్మ మాట్లాడుతూ మహాత్మ జ్యోతిరావు పూలే అడుగుజాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఆర్ డీఎస్ కళాశాల అధ్యాపకుడు పి అమూల్యారావు, చినరంగని పాలెం హైస్కూల్ ఉపాధ్యాయులు పి రాజబాబు, వారణాసి రాధాకష్ణ, చెరుకువాడ రంగసాయి, సీపీఐ నాయకులు అరసవల్లి సుబ్రమణ్యం, తదితరులు పాల్గొన్నారు.

జ్యోతిరావు పూలే జయంతి

భీమవరం: భీమవరంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద గురువారం జ్యోతిరావు పూలే జయంతి వేడుకలు నిర్వహించారు. ఈసందర్భంగా పూలే చిత్రపటానికి ప్రభుత్వ విఫ్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం శ్రీనివాస్ మాట్లాడుతూ పూలే సేవలను కొనియాడారు.

18న సర్వోదయ ఆవిర్భావ దినోత్సవం

భీమవరం: సర్వోదయ మండలి ఆధ్వర్యంలో ఈనెల 18వ తేదిన సర్వోదయ ఆవిర్భావ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు సర్వోదయ మండలి జిల్లా ప్రధాన కార్యదర్శి ఇందుకూరి ప్రసాదరాజు గురువారం తెలిపారు. ఏలూరు జిల్లా ఉంగుటూరు మండలం నాచుగుంట వద్దగల సర్వోదయ స్థూపం వద్ద సర్వమత ప్రార్థనలు, శాంతిప్రతిజ్ఞలు, సర్వోదయ యువవాహిని ర్యాలీ నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గాంధేయవాదులు, సర్వోదయ కార్యకర్తలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొని విజయవంతం చేయాలని ప్రసాదరాజు కోరారు.